# మినీ కథ

# పరువు

**కొండల అక్కరాజు**



అర్ధరాత్రి టెలిఫోన్ మ్రోగడంతో విసుగ్గా లేచి రిసీవర్ అందుకొన్నాడు ఎస్.ఐ. చంద్రశేఖర్.

"..............."

"నమస్కారం సార్! ఏమిటి ఇంత రాత్రి వేళ ఫోన్ చేశారు?!"

"............"

"ఈజిట్! నేనిప్పుడే బయల్దేరి వస్తున్నాను. ఓ పది నిముషాల్లో అక్కడ వుంటాను. అంటూ హడావిడిగా డ్రస్ వేస్కొని హుటాహుటిగా ఎమ్.ఎల్.ఏ. గారింటి వైపు బయలుదేరాడు.

'రండి చంద్రశేఖర్! చూడండి ఇల్లంతా ఎలా నాశనం చేసేశారో? మా ఫేమ్లీ నంతటిని బెదిరించి— ఇంట్లోవున్న డబ్బూ, నగలు ఎత్తుకుపోయారు? నేను ముఖ్యమైన విషయమై ముఖ్యమంత్రి గార్ని కలవడానికి హైద్రాబాద్ వెళ్ళి వచ్చేసరికి ఈ ఘోరం జరిగిపోయింది. మా అమ్మాయి పెళ్ళికై వుంచిన డబ్బూ, నగలూ అవి మీకు తెల్సుకదా? మా అమ్మాయి మేరేజ్ ఈ నెల ఎండింగ్‌లోనని. ఇస్తామన్న కట్నం డబ్బూ, నగలూ, పెట్టకపోతే పెళ్ళి ఆగిపోతుంది. ఈ విషయం 'ప్రెస్' వాళ్ళకు తెలిస్తే చిలువలు, పలువలు చేసి రాస్తారు. ఈ విషయం పలువురికి తెలీకుండా గోప్యంగా వుంచి, మీ మీద భారం వేస్తున్నాను. మీరు సమర్ధవంతంగా చాకచక్యంగా నేరస్థుల్ని పట్టుకొంటారని నాకు తెల్సు! మీ శక్తి సామర్ధ్యాల మీద నాకు పూర్తి నమ్మకం వుంది. మా డబ్బూ, నగలూ, ఎత్తుకుపోయిన దొంగల్ని మీరు పట్టుకోవాలి' అంటూ మంత్రిగారు ఎంతో ఎమోషనల్‌గా పలికేసరికి—

'థాంక్యూ సార్! నా మీద మీకా నమ్మకం వున్నందుకు. ఇప్పటికిప్పుడే. రంగంలోకి దిగి మీ డబ్బూ, నగలూ ఎత్తుపోయిన దొంగల్ని పట్టుకొంటాను. మీరు నిశ్చింతగా వుండండి' అంటూ అప్పటికప్పుడే ఫ్లాష్‌లా ఓ ఐడియా వెలగడంతో స్టేషన్‌కి బయలుదేరాడు.

'చూడు నాగరాజు! నీ శక్తి సామర్ధ్యాల మీద నాకు నమ్మకం వుంది. ఎలా సంపాదిస్తావో, ఏ ఇంట్లో దొంగిలిస్తావో నీ యిష్టం. ఓ లక్ష రూ. లు కాష్, 10 తులాల బంగారు నగలు నీవు కొట్టుకురావాలి. ఈ పని నువ్వు చాలా ఈజీగా చెయ్యగలవని నాకు తెల్సు. నేనవతల పెద్ద మనుషుల దగ్గర హేళన చెయ్యబడకుండా, మా డిపార్ట్‌మెంట్ పరువును నిలబెట్టడానికే ఈ విధంగా నీ సహాయాన్ని కోరుతున్నాను. దీనికి ప్రత్యుపకారంగా నీ మీదున్న 'రేప్' కేస్‌లో నీకెటువంటి సంబంధం లేదని నిరూపించి నిన్ను నిర్దోషిగా విడుదల చేయిస్తాను. ఆలోచించుకో... ...'

★ ★ ★

'సార్! మీ డబ్బూ, నగలు కాజేసి దొంగల్ని పట్టుకొన్నాను. మీ డబ్బూ, నగలూ తీస్కొని ఇప్పుడే మీ దగ్గరకొస్తున్నాను.'

"యూ ఆర్ గ్రేట్ చంద్రశేఖర్ గారు! మీలాంటి సమర్ధవంతమైన ఆఫీసర్లు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో వుండడం నిజంగా గర్వకారణం. రాత్రిపోయిన డబ్బూ, నగలూ— తెల్లారేసరికల్లా దోచుకుపోయిన దొంగల్నీ పట్టుకొని— మా డబ్బూ, నగలు మాకప్పచెప్పారు. ఆగిపోతోందన్న మా అమ్మాయి పెళ్లి ఆగిపోకుండా, మా 'పరువు' పోకుండా మాకెంతో సాయం చేశారు. మీకు త్వరలో 'ప్రమోషన్' వచ్చేలా చేసే బాధ్యత నాది. మీరు మొహమాటపడొద్దు. ఈ రోజు 'డిన్నర్' మా ఇంట్లోనే మిమ్మల్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. కాదనకండి!"

ప్రమోషన్ వచ్చేలా చూస్తానని ఎమ్.ఎల్.ఏ. గారు హామీ నివ్వడంతో ఎస్.ఐ. చంద్రశేఖర్ చాలా సంబరపడిపోయాడు. ఆనందంగా ఇంటికి చేరాడు.

ఇంట్లోకి ప్రవేశిస్తున్న ఎస్.ఐ.కి. భార్య ఏడుపు వినిపించింది.

'ఏమైంది' అంటూ ఆత్రుతగా అడిగాడు.

'ఏనండి! మీరు రాత్రి ఇంట్లో లేనపుడు ఎవడో దొంగవెధవ నన్ను బెదిరించి మనం ఇంటి కోసమై పొలం అమ్మగా వచ్చిన లక్ష రూపాయలు కాష్, నా బంగారు నగలు మొత్తం ఎత్తుకుపోయాడండీ' ఏడుస్తూ చెప్పింది.

అంతే! ఎస్.ఐ. గార్కి నాలిక తడారిపోయింది. ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఎస్.ఐ. గారింట్లో, ఎస్.ఐ. గారే పంపించిన దొంగ, ఎస్.ఐ. గారి ఇల్లంతా దోచుకుపోయాడనే మచ్చ లేకుండా 'పరువు'నిలబెట్టుకోడానికీ— ఎస్.ఐ. గారు ఆ విధంగా దొంగని నియమించుకోడానికి కారణం ఎమ్.ఎల్.ఏ. గారి దగ్గర తన ప్రతిభను నిలబెట్టుకోవడానికనీ, ఎం.ఎల్.ఏ. గారి కలా సహాయం చెయ్యాల్సొచ్చిందని— పలువురికీ తెలీకుండా ఎమ్.ఎల్.ఏ గారి దగ్గర, ప్రజల దగ్గర తన 'పరువు' నిలబెట్టుకోడానికీ— కప్పని మ్రింగించిన పాములా, తేలుకుట్టిన దొంగలా వుండిపోయాడు ఎస్.ఐ. చంద్రశేఖర్!